

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 13 పుష్పం : 39-41 20-06-2001



**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL : 6 ISSUE : 13**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**

Yearly : **Rs. 140/-**

Each Copy : **Rs. 10/-**

**ADDRESS**

**RAMANA BHASKARA**

SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**

P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**

SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278


## గుడ్డివాళ్ళు - వెలుగు - మతం

మన స్వరూపం, స్వయంజ్యోతి అయిన ఆత్మ, దాని ఉనికి తెలుపటానికి ఏ సాధనము అవసరములేదు. మనలో ఎవ్వరికీ, ఆ స్వయంజ్యోతికి సంబంధించిన అనుభవము లేదు. మన మనస్సుకు మన స్వరూపం గోచరించటం లేదు. అందుచేత మనమందరమూ ఆధ్యాత్మికంగా గుడ్డివాళ్లము. ఈ గుడ్డివాళ్లలో కొంతమంది, స్వయంజ్యోతికి సంబంధించిన ఏ అనుభవమూ లేకుండా, స్వయంజ్యోతి గురించి గంటల తరబడి వివరణ ఇస్తారు. వారికి స్వయంజ్యోతి దర్శనం కంటే, వివరణ మీదే దృష్టి ఎక్కువ, మన మనోనేత్రం మీద, ఆత్మవిస్మృతివల్ల, అనేక పొరలు ఏర్పడి, మనకు ఆత్మస్వరూపజ్ఞానం లేకుండా చేస్తున్నాయి. గురువు మాత్రమే ఈ పొరలను ఎలా తొలగించుకోవాలో, మౌనంలో శిష్యునికి బోధిస్తాడు. స్వయంజ్యోతిని తెలుసుకోవాలనే జిజ్ఞాస మనకున్నప్పుడు యుగయుగాలనుండి, మనమనో నేత్రంమీద ఏర్పడిన పొరలు తొలగుతాయి. ఈ పొరలన్నిటికి ఆధారము "నేను దేహమును" అనే మొదటి తలంపు, ఈ తలంపు, ఆత్మశక్తిమీద ఆధారపడి ఉన్నప్పటికి, అది మరచి, అన్నీ తనే చేస్తునట్టు తనమీద ఆరోపించుకున్న మూలాన మనస్సుమీద లెక్కలేనన్ని పొరలు ఏర్పడి, మనకు స్వరూపజ్ఞానం లేకుండా చేస్తున్నాయి. జీవితంలో మనం మొట్టమొదట చేయవలసిన పని, సద్గురువును ఆశ్రయించి ఈ పొరలను తొలగించుకొని, స్వయంజ్యోతి దర్శనము చేసుకోవటమే, గుడ్డివాడు తన కంటిమీద ఏర్పడిన పొరలను తొలగించుకోవటం నిజమైన మతం. గుడ్డివాడు ఆత్మవెలుగు గురించి వర్ణించటం ఎలా ఉంటుంది అంటే గుడ్లగూబ వెలుగు గురించి వర్ణించినట్లుగా ఉంటుంది. అట్టివారి ప్రసంగాల వల్ల పరస్పర విరుద్ధమైన విషయాలు జనించి లేనిపోని వివాదాలకు దారితీస్తాయి. ఆ ప్రసంగాలు విన్నవారు, మరింత గందరగోళ పరిస్థితిలో పడతారు. వ్యవస్థీకృతమతాల్లో ఈ ప్రసంగాలు చెప్పేవారికి, మంచి హోదా కల్పించి, జీతాలు కూడా ఇస్తారు. అట్టి గుడ్డివాళ్లను దేవుడే రక్షించుగాక!

**- ఎడిటర్**

**ఈ సంచికలో..............**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**


28-02-2001 గోడిపాలెం .............. 2

19-04-2001 పాలకొల్లు .............. 8

10-06-2001 సిద్దాపురం .............. 13

# 'దేహము నేను' అనే తాదాత్మ్యమే సైతాను - అన్ని అరిష్టాలకు అదే మూలం

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-2-2001, గోడిపాలెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రపంచంలోకి మనం వచ్చినందుకు ఆలోచనను, వివేకంను, విచారణను పెంచుకోవాలి. ఈ ప్రపంచంలోకి మనం క్రమశిక్షణ సంపాదించటాన్కే వచ్చాము. భగవంతుడు దేహప్రారబ్ధంలో మన వంతుకు ఇచ్చిన పనిని సక్రమంగా నిర్వర్తించాలి. బ్రహ్మభావనతో పనిచేస్తే దేహం, ఇంద్రియములు స్వాధీనంలోకి వస్తాయి. దేహప్రారబ్ధమును బట్టి మనం ఏ వృత్తిలో ఉన్నా మనం ఎవరిగా ఉన్నామో అట్టి చైతన్య భావనను మరువకూడదు. ఒక పురుషుడు స్త్రీ వేషంవేసినా తను పురుషుడు అన్న విషయం మరచిపోడు. అదేవిధంగా మనం ఆత్మభావనతో పనిచేస్తే దేహభావం నష్టం అవుతుంది. దేహభావమే కల్పితములకు కారణం. కల్పితములే కల్లోలములను కల్గించి దుఃఖాన్ని తీస్కువస్తాయి. దుఃఖం శరీరాన్కి వేడిని కల్గిస్తే, సుఖం శరీరాన్కి చల్లధనం తీస్కువస్తుంది. బహుజన్మల సత్కర్మ, ఎంతో సాధన చేస్తేకాని మోక్షస్థితి అనుభవంలోకి రాదు. ఎప్పుడు మనకు కడసారి జన్మ వస్తుందంటే ప్రపంచంలో ఉండగానే నిష్ప్రపంచస్థితి పొందినవాడ్కి ఇదంతా వాసుదేవమయం అని గోచరిస్తుంది. ప్రపంచం అంతా తనలోనే జీర్ణం అయిపోతుంది. అదే వాడి కడసారి జన్మ. అట్టివాడు అశాశ్వతమైన, అస్థిరమైన ఈ ప్రపంచాన్కి తిరిగి రావలసిన పనిలేదు. పారమార్థిక దృష్టిని పెంచుకోవాలనుకునేవాడు సర్కస్‌లో తీగమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా నడుస్తాడో అంత జాగ్రత్తగా జీవించాలి. ఎవరు ఏ వృత్తిలోనైనా లౌకిక దృష్టితో పనిచేస్తే లోకాన్ని అతిక్రమించలేరు. లోకవాసన మానవ మానసమును పట్టి పీడిస్తుంది. అభిమానమును పెంచుతుంది. చిత్త వృత్తిలోంచి విడుదల పొందలేడు. రాగద్వేషములు చిత్తవృత్తుల రూపంలో ఉంటాయి. భయస్తుడు, బలహీనుడు, బద్ధకస్తుడు, ఏకాగ్రతలేనివాడు రాగద్వేషములనుండి విడుదల పొందలేడు. రాగద్వేషములు జీవితమునకు సుడిగుండములవంటివి. అందులో చిక్కుకుంటే ఆనందమును అందుకునే అవకాశం లేదు. సత్వగుణంను అభ్యసించాలి. సత్వగుణం అభ్యసిస్తే రాగద్వేషములనే సుడిగుండములనుండి విడుదల పొందవచ్చును. సత్వగుణం మోహంను నశింపచేస్తుంది. గుణాతీతస్థితి వచ్చేవరకూ బహుజాగ్రత్త అవసరం. ఏ వాసనలోంచి విడుదల పొందటాన్కి అయినా ధైర్యం అవసరం. ధైర్యంలేనివాడు లౌకిక దృష్టిని త్యజించలేడు.

మనో నిగ్రహమునకు జప ధ్యానములు అవసరం. దేహం మనస్సుది మాత్రమే.

మనస్సులో వచ్చే తలంపుల ప్రభావం దేహంమీద ఉంటుంది. దేహం మనస్సుయొక్క కల్పన. మనస్సు స్వాధీనంలోకివస్తే దేహాన్కి ఆరోగ్యం వస్తుంది. ఈ మధ్యకాలంలో వైద్యులుకూడా దేహంమీద ఉన్న మనస్సుయొక్క ప్రభావం గుర్తిస్తున్నారు. శరీరంలో రోగకారణం లేకపోయినా మనస్సులో ఉన్న అలజడి, అశాంతి, అసంతృప్తి, దేహంయొక్క రోగనిరోదక శక్తిని తగ్గించటమే కాకుండా దేహాన్ని రోగాలపాలు చేస్తుంది. అంచేత ఏదైనా రోగంవస్తే మందులు వాడుతూ మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవటం అవసరం అంటున్నారు. మనస్సు నిర్మలంగా, ప్రశాంతంగా ఉండాలంటే సత్‌పురుషులతో సహవాసంవల్ల మనస్సుకు అలజడి తగ్గి చల్లబడుతుంది. పూర్వ పుణ్యంలేనివార్కి సజ్జన సాంగత్యం విలువ తెలియదు. మనస్సు తన మూలమైన చైతన్యంలో అణిగేవరకూ మనస్సుకు బహిర్ముఖత్వం పోదు. మనస్సునే జీవుడు అనికూడా అంటారు. జీవుడుకి ఉపాధితో సంబంధంలేని ఆనందం అందేవరకూ ఉపాదులను ధరిస్తూనే ఉంటాడు అదే సంసారం.

జప, ధ్యానాలు మనస్సుకు అంతర్ముఖత్వం అలవాటు చేస్తాయి. అంతర్ముఖత్వం పొందిన మానసమునకు సొంత తెలివి, ఆత్మజ్ఞానం కల్గుతాయి. మనకు పరిస్థితులు అనుకూలంగాఉన్నా ప్రతికూలంగాఉన్నా జప, ధ్యానములను విడిచిపెట్టకూడదు. దీనినే శ్రద్ధ అంటారు. శ్రద్ధ లేనివాడు అంతఃకరణంలోని దోషములనుండి విడుదల పొందలేడు. ఒక్క జ్ఞాని తప్పించి తను ఎవరో తాను తెల్సుకొనేవరకూ ప్రతి మనిషి ఆందోళనకు గురిఅవుతాడు. శరీరం ఉన్నంతకాలం రోగంరాక మానదు. అదేవిధంగా మనస్సు ఉన్నంత కాలం ఏదోవిధంగా ఆందోళన తప్పదు. మనస్సును అదిగమించి మనోనాశనమైనవాడ్కి ఏ బాహ్య సంఘటన ప్రభావం వాడిమీద ఉండదు. కొంతమంది విచక్షణ, సూక్ష్మబుద్ధి చూడండి. ఒక కాలేజ్‌లో చదువుకునే అమ్మాయి మా దగ్గరకు వచ్చింది. భగవంతుడ్ని ఏమి కోరను ప్రారబ్ధంలో ఉన్నది వస్తుంది. ఏదో ఇమ్మని ఆయన్ను బలవంతం చేయను సత్ సంకల్పాలు ఇమ్మని వేడుకుంటాను అవే కదా! ఆధ్యాత్మికంగా, భౌతికంగా అభివృద్ధిలోకి రాటాన్కి ఉపయోగపడతాయి. అంచేత ఇతర్లు నా గురించి ఏమనుకుంటున్నారో అది నాకు అనవసరం, కాని నాకు ఇతర్లపట్ల వచ్చే సంకల్పాలు మాత్రం మధురాతి మధురంగా ఉండాలి అలా అనుగ్రహించండి నన్ను అని అడిగింది. ఇలా సహజ సాధన చేసేవార్కి ఎప్పుడో ఒక మధుర క్షణాన మనస్సు దాని గూటిలో అది స్థిరపడిపోతుంది.

శేషాద్రిస్వామి అందర్నీ లోపలకు వెళ్ళండి, లోపలకు వెళ్ళండి, ఎంత లోపలకు వెళ్తారంటే ఆ సద్వస్తువు ఎంత లోతులలో ఉందో అంత లోతులకు వెళ్ళండి అనేవారు. కారణం అక్కడే

నీ విశ్రాంతి కేంద్రం ఉంది. బయట ప్రపంచంలో ఎక్కడ విశ్రాంతి లేదు. ఉన్నదంతా నీ హృదయంలోనే ఉంగి. హృదయంలోంచే నేననే తలంపు ఉదయిస్తున్నది. నేననే తలంపు ఉంటే మనస్సు ఉన్నది, మనస్సుఉంటే దేహంఉంది, దేహంఉంటే లోకంఉంది, లోకంఉంటే దేవుడు ఉన్నాడు. ఆధారం హృదయమే. వైష్ణవులు జగత్తు, జీవుడు, దేవుడు మూడు నిజం అంటారు. భగవాన్ చైతన్యంసందే ఈ మూడు కల్పించబడ్డవి అన్నారు. బంగారంనందే ఆభరణములు కల్పించబడతాయి. బంగారం తీసేస్తే ఆభరణాలు ఏంఉంటాయి. అదేవిధంగా చైతన్యం తీసేస్తే జగత్తుకు, జీవుడుకి, దేవుడికి అస్థిత్వం లేదు. ఆనందకేంద్రం నీ హృదయం లోపలేఉంది. వెళ్తున్నావు, వెళ్తున్నావు కొంతదూరం వెళ్ళి బైటకు వచ్చేస్తున్నావు. తూకం. వైరాగ్యంలేక, అభ్యాసంచేసి తూకంను పెంచుకో. అప్పడు లోపలకు వెళ్ళాలి, వెళ్ళాలి అని ఆనందం దొరికేవరకూ వెళ్ళిపోతావు. మన హృదయ కేంద్రంమీద మనకు సజీవమైన విశ్వాసంఉంటే అభ్యాసం, వైరాగ్యం సహజంగా వచ్చేస్తాయి. వాలు గాలిలో సైకిల్ తొక్కినట్లు ఉంటుంది సాధన.

నామజపం చేసేకొలది చేస్తున్న జీవుడు పవిత్రుడు అవుతాడు. అంతఃకరణం శుద్ధి అవుతుంది. ఇతర్లకు తనపట్ల ఉన్న ఆగ్రహాన్ని, అసూయను సహించగల శక్తికి చేరుకుంటాడు. మనస్సును దుర్మార్గమునుంచి విడిపించి సన్మార్గంలో పెట్టేది జపం. నీ సన్మార్గమే నీ హృదయంలోఉన్న ఆత్మ తేజస్సును దర్శింపచేస్తుంది. లోకంవచ్చి ఉద్ధరిస్తుందని కనిపెట్టుకుని ఉండకండి అవసరం అయితే లోకం నాల్గురాళ్ళు వేస్తుంది. అందుకే గీతలో పరమాత్మ నీ మనస్సును నువ్వు స్వాధీనం చేస్కుని ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావటాన్కి కృషి చేసుకో అన్నారు. నీ ప్రయత్నమే అనుగ్రహంగా మారి హృదయగుహలో నీ మనస్సు ఉండటాన్కి అలవాటుపడి, మనో నాశనమై దాని స్వస్థానంలో అది స్థిరపడుతుంది.

ఆత్మానుభవం కలగకుండా ఉండటాన్కి చిక్కంతా ఇక్కడే ఉంది. దేహం నాది అనుకుంటే పొరపాటు లేదు, దేహమే నేను అనుకుంటున్నాము అదే పొరపాటు, ఈ పుస్తకం నాది అంటాం, పుస్తకమే నేను అనుకుంటామా? అదేవిధంగా దేహం నేను అనుకోటాన్కి, దేహం నాది అనుకోటాన్కి ఎంతో వ్యత్యాసం ఉంది. దేహాభిమానం లేనివాడ్కి దేహం తానుకాదని స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. దేహం లేనప్పడుకూడా తాను ఉంటానని అవగతం అవుతుంది. తన అస్థిత్వాన్ని దేహాన్కి పరిమితం చేసుకున్నప్పడు దేహం పోయినప్పడు తానుకూడా పోతాననుకుంటాడు. దేహం నేను అనే తలంపే సైతాను అన్ని అరిష్టాలకు అదే కారణం. అంచేత దేహాన్కి రోగంవస్తే వైద్యం చేయించు, అన్నంపెట్టు, స్నానంచేయించు కాని

ఆ దేహమే నేను అనుకోకు. నీకు ఇష్టంఉన్నా లేకపోయినా ఏదో ఒకరోజు విడిచిపెట్టేయాలి కారణం దేహం నువ్వుకాదు కాబట్టి చిక్కుముడి అంతా ఇక్కడే ఉంది. ఆ అహంకార గ్రంథి తెగేవరకూ ఎవరికీ ఆత్మజ్ఞానం అనుభవంలోకి రాదు. ఆత్మజ్ఞాన సముపార్జనకు మనోదేహములను ఉపయోగించుకోవాలి. వాటి ప్రయోజనం అంతవరకే. సత్కర్మ చేస్తుంటే దుష్కర్మయొక్క ప్రభావ వేగం తగ్గుతుంది. ఆ చేసే మంచికూడా నేను చేస్తున్నాననే కర్తృత్వ భావన లేకుండా ఇష్టంగా, ప్రేమగా, ప్రీతిగా చేయాలి. పూర్వజన్మలనుంచి వచ్చిన దుష్కర్మ ఏదైనా ఉన్నప్పటికీ అదంతా మర్చిపోయి సత్కర్మ చేస్తుంటే దుష్కర్మ ప్రభావం తగ్గుతుంది. సాధ్యమైనంతవరకూ జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోకపోవటం మంచిది. జరిగిపోయిన విషయాలను జ్ఞప్తికి తెచ్చేది కేవలం అహంకారమే అని సాధకుడు గుర్తించాలి. అందుకే అంబేత్కర్ భార్యతో అనేవారు 30 సం॥లకే 90 సం॥ల వాళ్ళలా ఉండాలంటే జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవాలి. 60 సం॥లు వచ్చినా యవ్వనంలో ఉండాలంటే భవిష్యత్తు గురించి ఆలోచిస్తే ఉజ్జ్వలమైన భవిష్యత్తులోకి వెళ్తాం అనేవారు. అంచేత గతాన్ని తలపెట్టుకునే వారంతా చీకటిలోకి చూసే జనంలాంటి వాళ్ళు, భవిష్యత్తు గురించి ఆలోచించేవారు వెలుతురు చూసేవాళ్ళు అన్నారు అంబేత్కర్. కొంతమంది పరిస్థితులు అనుకూలంగాఉన్నా ప్రతికూలంగాఉన్నా ఈశ్వరుడిపట్ల విశ్వాసంను విడిచిపెట్టరు అట్టివార్నే ఉక్కుతో చేసిన మనషులు అని అంటారు.

వాచక జపంకంటే మానసిక జపం శక్తివంతమైనది. ఏకాగ్రత కల్గచేస్తుంది. ఇంతవరకూ నీకు సహజస్థితే, అసహజస్థితివలే కనిపిస్తున్నది. జపం చేయగా, చేయగా అసహజంగా ఉన్న నీకు సహజస్థితి వస్తుంది. మనస్సు పల్చబడి తేటబడుతుంది. వాచకజపం, మానసిక జపాన్కి దారితీస్తుంది. మానసికజపం ధ్యానాన్కి దారితీస్తుంది. నీ ధ్యానంయొక్క లోతులు పెరిగితే హృదయంలోని సత్యం తళుక్కున మెరసి అనుభవంలోకి వస్తుంది. కొంతమంది ప్రపంచజ్ఞానమే ఆత్మజ్ఞానం అనుకుంటారు. ఇటువంటి వాళ్ళకు లౌకిక దృష్టి పెరుగుతుంది. లోకం గోచరిస్తుంది కాని లోకాన్కి ఆధారంగా ఉన్న సద్వస్తువు గోచరించదు.

బ్రహ్మమే సత్యం, జగత్తు లేదు అని వేధం చెప్పింది. ఈ వాస్తవ స్థితిని సాధించటాన్కే వాక్కుతపస్సు, మానసిక తపస్సు, శారీరక తపస్సు అవసరం. జగత్తు నీకు నిజంగా కనిపిస్తున్నంత కాలం ఏదో ఒక ఆకర్షణకు గురిఅవుతావు. వెంటనే మనస్సు బహిర్ముఖం అవుతుంది. బహిర్ముఖమైన మనస్సు మాత్రమే లోక, శాస్త్ర, దేహ వాసనలను పెంచుతుంది. బ్రహ్మభావనలో స్థిరపడినవాడ్కి ఏ ఆకర్షణలు ఉండవు. వాడ్కి లోకంకూడా బ్రహ్మంగానే కనిపిస్తుంది. వాడు

పొందిన నిజస్థితికి భిన్నంగా ఏది ఉండదు. భిన్నత్వం లేనప్పుడు బలహీనతలు ఉండవు.

॥కృతి మహోదదౌ పతన కారణం, ఫలమశాశ్వతం గతి నిరోధకం॥

ఇది ఒక కర్మ సముద్రం అంటే కర్మ చేస్తాం ఫలం ఆశిస్తాం. వచ్చిన ఫలంను త్యాగం చేయం భోగిస్తాము. ఆ భోగించేప్పడే వాసన పడుతుంది. వాసనలోంచి కోరిక వస్తుంది. కోరికతో మళ్ళీ పనిచేస్తాం. ఇది కర్మచక్రం. ఈ కర్మ సముద్రంలో పడినవాడ్కి చైతన్యం గోచరించదు. ఇందులోంచి గురువు అనుగ్రహం, శాస్త్ర అనుగ్రహం, ఈశ్వరానుగ్రహం లేకుండా ఏ మానవుడు బైటకు రాలేడు. కర్మఫలం శాశ్వతంకాదు. అనుభవిస్తే పోతుంది అంతేకాదు మోక్షం సంపాదిద్దాం అనే బుద్ధికూడా నీకు కలగనీయదు. అయినా శరీరమే అశాశ్వతం అయ్యినప్పడు కర్మఫలం శాశ్వతం ఎలా అవుతుంది? కర్మఫలం భోగించటాన్కి నీ మనస్సు అలవాటు పడిఉంది. అంచేత ఆసక్తి లేకుండా కర్మను ఆచరించి ఈశ్వరానుగ్రహాన్ని సంపాదించు. అసలు గురువు పని ఏంటంటే ఆశీస్సులు ఇవ్వటం, ప్రేమించటం, బోధించటం, అవసరం అయితే సేవ చేయటము. తను బోధించింది భక్తులకు అనుభవంలోకి తీస్కురావటాన్కి ప్రేమించకుండా బోధించలేడు. గురువు తన బోధ అందుకునేవాళ్ళను తరింపచేస్తే తనపని అయ్యిపోయింది అనుకోడు. అందుకోలేనివాడి స్థాయికి దిగివచ్చి బోధించి తరింపచేస్తాడు. అటువంటి దయతో బోధిస్తుంటే మనుషులకే కాదు పశుపక్షాదులకుకూడా జ్ఞానం వస్తుంది. అటువంటి గురువుపట్ల నమ్రత కల్గిఉండాలి. నమ్రత లేనివాడ్కి ఆత్మజ్ఞానం అనుభవంలోకి రాదు.

ప్రపంచంలోని మానవులంతా ఇక్కడే పరాజయం పొందుతున్నారు. అహంకారం నశించకూడదు ఆత్మజ్ఞానం కలగాలి. కంచంలో అన్నం తరగకూడదు పిల్లాడు దుడ్డులా ఉండాలి అంటాము. సాధన చేస్తున్నాము అయితే అహంభావనను మినహాయించి, దాన్కి గురిపెట్టకుండా, దాన్ని ముస్తాబు చేస్తూ దాన్కి దెబ్బలు తగలకుండా సాధన చేస్తాము. అహంభావనను మన సాధనలో ఇమడ్చాలి. దాన్ని ఇమడ్చకుండా అది నశించదు. అహంభావనే మనం అనుకోటంవల్ల మనం దాన్ని ఇమడ్చము. నీ సాధన అంతా నూటికి నూరుశాతం అహంకారంమీద గురిపెట్టకపోతే అది నశించదు. అది నశిస్తేకాని ఆత్మజ్ఞానం రాదు. కొంతమంది బాగా సాధన చేస్తున్నాము అంటారు చిన్న మాట అంటే ఎరవైనా భరించలేరు. గౌరవాన్ని, అగౌరవాన్ని, లాభాన్ని, నష్టాన్ని సమానంగా భరించేవాడే సాధకుడు. ఇలా భరించగల శక్తిని సమకూర్చుకుంటే మూలతలంపు రూపంలో ఉన్న అహంభావనకు ఆహారం అందదు.

అహంభావనపోతే తాను పోడు కాని తాను ఏ ఆత్మగా ఉన్నాడో అట్టి ఆత్మ అనుభవైక వేద్యం అవుతుంది. అన్ని లాభాల్లోకి గొప్పలాభం ఆత్మలాభం. అయితే అహంభావన పోతేకాని ఆత్మలాభం అందదు. వ్యక్తిభావన పోతేకాని అఖండ భావం రాదు. అఖండ భావం రావాలంటే ఆకాశంతో స్నేహం చేయాలి. ఆకాశంతో స్నేహంవల్ల రూపబుద్ధి, నామబుద్ధి తగ్గి హృదయం విశాలం అయ్యి అఖండభావం వస్తుంది. అఖండభావన ఆత్మజ్ఞానాన్ని సహకరిస్తుంది.

సహనంవల్లకూడా హృదయంయొక్క లోతులు పెరుగుతాయి. మనస్సుకు లోచూపు కల్గుతుంది. సహనంను అభ్యాసం చేయాలంటే నిరంతరం రాముడ్ని గుర్తుపెట్టుకోవాలి. కారణం రాముడికి భూమికి ఉన్నంత ఓర్పు, సహనం ఉంది. రాముడు మర్యాద పురుషోత్తముడు. ఎవరైనా ఎదురు వస్తుంటే ముందు ఆయనే తప్పకుని ఎదురు వచ్చేవాళ్ళకు దారి ఇచ్చేవారు. రోడ్లమీద ప్రమాదములకు కారణం డ్రైవర్లకు సహనం లేకపోవటమే. ఇంట్లోనూ, సమాజంలోనూ కలహములకు కారణం సహనంలోపించటమే. సహనంవల్ల ఆధ్యాత్మికంగా, భౌతికంగాకూడా లాభమే. సహనంవల్ల శాంతి, కాంతి వస్తాయి. సహనాన్ని ఆరాధించేవాడ్కి సహజసమాధి కల్గుతుంది. ధనాన్ని అధికారాన్ని ఆరాధించేవాడ్కి భోగం, సహనంను ఆరాదించేవాడ్కి శాంతి కల్గుతాయి.

**సాధనచేసి హృదయం యొక్క లోతులను పెంచుకొన్నవాడిని బాహ్య సంఘటనలు బాధించవు**

## ఫలాపేక్ష లేనికర్మవల్ల అంతరంగంలోని దోషములు పోయి అంతట అవే రాలిపోయి ఆత్మజ్ఞానానికి దారి తీయును.

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-4-2001, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆత్మానుభవం కల్గటాన్కి ఎక్కడికో పారిపోయి గుహల్లో నివసించక్కర్లేదు. ఉన్నచోటే ఉండి లోపల వివేకంను, బుద్ధి సూక్ష్మతను, చల్లదనాన్ని, జ్ఞానంను పెంచుకుంటూ రావాలి. దేహం ఏ గ్రామంలో ఉంది అనేది అప్రదానం మనస్సు ఎక్కడ ఉన్నది అది ప్రదానం. సర్వసాదారణంగా సమాజాన్కి, దైవాన్కి మనం దూరం అవుతూ ఉంటాం దాన్కి కారణం మన అహంభావనే అనే సంగతి కూడా మనకు తెలియకపోవచ్చును. భగవంతుడు మనల్ని స్వీకరించటాన్కి సిద్ధంగానే ఉన్నాడు. కాని మన ముఖమే అటు తిరగటం లేదు. అందుకే పరమహంస అంటారు. ఈశ్వరుడు మనకోసం ఎదురు చూస్తూఉంటాడు. మనం ఒక్క అడుగువేస్తే ఆయన తొమ్మిది అడుగులు ముందుకు వచ్చి అందుకుంటాడు అనేవారు.

మనం దేహాన్కి ఇస్తున్నంత ప్రాముఖ్యం మనస్సుకు ఇవ్వటం లేదు. మరణించినప్పడు దేహాన్ని మనస్సు విడిచిపెట్టిన వెంటనే దేహం శవం అవుతుంది. మరణానంతర జీవితంలో మన కూడా వచ్చేది మన మనస్సే. అందుకే దాన్కి నిగ్రహం నేర్వాలి, మనస్సులోనే వాసనలన్నీ ఉన్నాయి ఆ వాసనల నుండి మనస్సును విడుదలచేస్తే అదే బ్రహ్మాకారం పొందుతుంది. మనస్సులో స్థిరత్వం లేనివాడు, దృడత్వం లేనివాడు ఏ కార్యమును సాధించలేడు. తపస్సు అంటే మనస్సును ఎండింపచేయటము. వ్యక్తిగా జీవిస్తే మనస్సు పెరుగుతుంది. ఆత్మ ఎలా ఉందో అలా మనం ఉండగల్గితే మనస్సు నశిస్తుంది. మనం ఎక్కడకు వెళ్లినా సమాజం ఉంటుంది. మనస్సు ఎంత నిజమో సమాజం కూడా అంతే నిజం. సమాజం కేవలము మనో కల్పితము. జాగ్రదావస్థలో కనిపించే పొడుగైన కలలాంటిది. మనోనాశనం అయినవాడ్కి సమాజం ప్రతిబంధకం కాదు. మంచి, చెడుల సమ్మేళనమే సమాజం. సాధకుడు మంచికి దగ్గరగా, చెడుకి దూరంగా ఉండటం నేర్చుకోవాలి. సమాజంలో ఎక్కడైనా మంచికనిపిస్తే నేర్చుకోటాన్కి ప్రయత్నం చేయాలి. మంచితనమునకు తలవంచి నమస్కరించాలి. మంచితనము అమృతానుభవమునకు పునాది వంటిది. శరీరాన్ని నడిపేది మనస్సు మాత్రమే. అందువలన మనస్సును శుద్ధి చేసుకుంటే శిద్ధి కల్గుతుంది. ఆ సిద్ధి పొందుటకు శరీరాన్ని, ఇంద్రియాల్ని ఉపయోగించుకోవాలి. ఇష్టము, అయిష్టము మనోకల్పితములే. అందువలన మనస్సుకు ఊగిసలాట వస్తుంది, చపలత్వం ప్రారంభం అవుతుంది. ఏ ఇంద్రియాన్కి బలహీనత

ఉందో ఆ ఇంద్రియంద్వారా మనస్సు బహిర్ముఖం అవుతుంది. దేహాన్కి అజీర్తివ్యాధి ఎటువంటిదో మనస్సుకు బహిర్ముఖత్వం అటువంటిది. వివేకవంతంగా జీవించటం నేర్చుకున్నవాడ్కి నెమ్మదిగా బహిర్ముఖత్వం తగ్గుతుంది. మనస్సు బైటకువెళ్తే దుఃఖం, లోపలకు వెళ్తే సుఖం, మనస్సు బైటకు వెళ్తే ప్రకృతి, లోపలకువెళ్తే ఆత్మ. మనస్సు బైటకువెళ్తే అజీర్ణం, అజ్ఞానం, లోపలకువెళ్తే జీర్ణం, జ్ఞానం.

పుట్టుకతో తెలివితేటలు ఉండటం మంచిదే పుట్టుకతో తెలివి లేకపోతే మనం కష్టపడి తెలివిని, వివేకంను సంపాదించుకోవాలి. మనకంటే వివేకం, తెలివిగల వారితో, మనకంటే మంచివారితో సహవాసం చేయటం ఉత్తమం. జీవిత విధానమును ఇలా మలచుకోవటంవల్ల భక్తి కల్గుతుంది. భక్తివలన పనియందు నిష్ఠ కల్గుతుంది. పనిలో దైవాన్ని చూసే స్థాయికి ఎదుగుతాము. భక్తి వలన సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్వస్వరూప అనుసందానమే భక్తి అని ఆదిశంకరాచార్యులవారు అన్నారు. భక్తి ద్వైతంలో ప్రారంభమైనా అద్వైతంతో ముగుస్తుంది.

శరీరం ఏదో ఒకరోజు చనిపోతుంది. అది నిశ్చయం అయితే ఆ రోజువచ్చే లోపే కొంచెం, కొంచెం చనిపోవటం నేర్చుకోమన్నారు భగవాన్ అంటే పొట్టకోసం ఏ వృత్తిలోఉన్నా అహంవృత్తికి దూరంగా ఉండు, ఎటువంటి పరిస్థితులలోనైనా నువ్వు ఎవరిగా ఉన్నావో ఆ సత్యవస్తువును మరువకు. నశించే వస్తువుల మధ్య ఉన్నప్పటికీ వాటితో తాధాప్యం పనికిరాదు. తాదాప్యం పెట్టుకుంటే దుఃఖం వెంటాడుతుంది. దుఃఖకారణమును తొలగించుకోగల్గితే దుఃఖం నశిస్తుంది. దుఃఖం తలంపు రూపంలో ఉంటుంది. తలంపు వాసనలోంచి ఉదయిస్తుంది. ఈశ్వరుడి పాదాల్ని ఆశ్రయించి, జీవితం పొడుగునా ఆయన్ను స్మరించుకుంటూ వాసనలోంచి విడుదల పొందాలి. దుఃఖం మనస్సులో ఉంటుంది. నువ్వు మనస్సు అనుకున్నప్పుడు కూడా చైతన్యానివే. చైతన్యాన్కి హద్దులు లేవు అది ఆనందమయము. చైతన్య స్మృతి విడిచిపెట్టకుండా ఉంటే నీకు దుఃఖకారణం ఉన్నా అది నిన్ను ముట్టుకోదు.

షిర్డీబాబా :- 1. నిష్ఠ, 2. ఓర్పు ఉండాలి అన్నారు. ఇవి రెండూ లేకుండా ఎంతమంచి పని తలపెట్టినా ఎవరూ ఆ పనిని పూర్తి చేయలేరు. నిష్ఠ అంటే ఏకాగ్రత. ఒక పనినైనా, సాధన అయినా తలపెట్టినప్పుడు ఎవరో ఏదో అంటారని మానకుండా చేస్తే అది నిష్ఠ. ఖగోళంలోని రహస్యాలనుకాని, మన హృధయంలోని సత్యాన్నికాని తెలుసుకోవాలంటే ఏకాగ్రత అవసరం. ఓర్పు అంటే సహనం. ఎవరికైతే సహనం లేదో వాడు సహృదయుడు, అవతార పురుషుడు ఎలా అవుతాడు అన్నారు షిర్డీబాబా. పొగడ్తలకు, విమర్శలకు అతీతం ఆ సద్వస్తువు. పొగడ్తలు, విమర్శలు పట్టించుకోకపోతే గాలిలో కల్సిపోతాయి అలా పట్టించుకోకుండా

ఉండటాన్కే సహనం అవసరం. సహనం సద్బుద్ధిని కల్గిస్తుంది. సద్బుద్ధి సత్యస్థితికి దారి చూపిస్తుంది.

విద్యలు అనేకం ఉన్నాయి. అందులో ఆత్మవిద్యను నేను అని భగవంతుడు భగవద్గీతలో అన్నారు. విద్యలకు రాజు ఆత్మవిద్యే. ఆత్మవిద్యద్వారానే మన స్వరూపం మనకు తెలియబడుతుంది. స్వరూపం అరూపమే, అయితే అది అనుభవైక వేద్యం. నిరంతరం ఆత్మను చింతించటం వలన ప్రజ్ఞ పెరుగుతుంది, మనస్సు అణుగుతుంది. అణిగిన మనస్సున్నవాడు ఎక్కడున్నా ఇబ్బంది లేదు. మనస్సుతోటి గ్రహించేవి విషయములు. మనస్సు అణిగినచోట ఉదయించేది జ్ఞానము. పూర్ణస్థితి అనుభవంలోకి వచ్చేవరకూ ఏదో ఒక వెలితి, కొరత, దుఃఖం, కర్తృత్వం నిన్ను వెంటాడుతూనే ఉంటాయి ఎన్ని జన్మలు ఎత్తినా. అంచేత ఏ పని చేసినా నీ అజ్ఞానంలోంచి విడుదల పొందటాన్కి ఆ పని నీకు సహకరించాలి. అంతేకాని పని చేయటమే యోగంకాదు. ఎలా పనిచేస్తే అజ్ఞానంలోంచి విడుదల అవుతామో అలా చేస్తే ఆ పని యోగంతో సమానము.

మద్రాసులో జాతిపిత గాంధీజికి హరిజన నిధి నిమిత్తము ఒక లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చి మీరు సంతోషిస్తున్నారా అని అడిగారు. ఇచ్చేవాడ్ని ఇచ్చేసే వరకూ నేను సంతోషించను అన్నారు. కర్తలేని కర్మ చేయమని గాంధీజి బోధించారు. కారణం దుఃఖం కర్తృత్వ రూపంలో ఉంది. కర్తృత్వం నశించకుండా దుఃఖం నశించదు. మనలో మంచితనం లేకపోతే ఇతర్లలోఉన్నా కనపడదు. మంచితనం ఉంటే సరిపోదు సమర్ధత ఉండాలి. అందుకే అజ్ఞాని, జ్ఞానిని అర్ధం చేసుకోలేడని చెపుతారు. మనలో ఉన్న చెడ్డే ఇతర్లలోని చెడుగా కనిపిస్తుంది. ఇతర్లు అన్న మాటలకు నీలోఉన్న అపవిత్రతే గాయపడుతుంది. మనలో అపవిత్రత లేకపోతే ఎవరైనా ఒకమాట అన్నా మనస్సు గాయపడదు. అపవిత్రతను అలంకరించటం మానేస్తే అది పల్చబడిపోతుంది. అలంకరిస్తే పెరిగిపోతుంది. అహంభావనను త్యజించినవాడే నిజమైన సన్యాసి, దాన్ని త్యజించకుండా ఎన్ని వేషాలు వేసినా పొట్టకోసమే అవుతుంది. గుర్రంలాగా పనిచేస్తూ సన్యాసిలాగా జీవించేవాడ్ని కర్మయోగి అంటారు. కర్మను యోగంగా చేసేవాడ్కి అంతఃకరణంలో ఉన్న దోషములు వాటంతట అవే రాలిపోయి అనంతమైన జ్ఞానంలోకి ప్రవేశిస్తాడు. నీ చేత్తో ఎంత మంచిపని చేసినా అది రెండోపక్షం అన్నారు భగవాన్. ఆత్మజ్ఞాన సముపార్జన వలన ఈ లోకాన్కి నీద్వారా సహాయసహకారములు అందుతాయి. భూమిని వెలుగుతో నింపవచ్చు, శాంతితో తడపవచ్చు, అంతములు లేని అనంతముతో జీవకోటిని కప్పవచ్చును అన్నారు భగవాన్.

20-06-2001

మాటకంటే, వ్రాతకంటే మౌనం శక్తివంతమైనది. మౌనంకూడా మాట్లాడుతుంది అది నిరంతర ప్రసంగం అయితే ఆ భాష పక్వత పొందిన జీవులకు కాని అర్థంకాదు. మునియొక్క మౌనం మూగవాడి మౌనం లాంటిది కాదు. మనస్సు ఎక్కడ అణుగుతుందో అక్కడ నుంచి వచ్చేదే నిజమైన మౌనం. మూగవాడు మాటలురాక మౌనంగా ఉంటాడు. జ్ఞాని సహనంవల్ల మౌనంగా ఉంటాడు. అది మనోమౌనం ఆ మౌనం మాటకు, మనస్సుకు అందదు. అట్టి మనోనాశనం పొందినవాడిద్వారా అతని ఉపాది ఉన్నా లేకపోయినా లోకాన్కి శాంతి, కాంతి ప్రసరిస్తూ ఉంటుంది. శాస్త్రజ్ఞానంకన్నా అనుభవ జ్ఞానం మిన్న. మనకు అనుభవంలో లేనిది మనకు సొంతంకాదు అది అజీర్ణమే. జీర్ణమైనదే మన సొంతము. నిజాన్కి ఉన్న కాలం ఒక్కటే అదే వర్తమానకాలం. వర్తమానకాలంలో సజీవింగా జీవించటం నేర్చుకోవాలి. అట్టివాడు నేర్చుకున్నది ఇముడ్చుకుంటూనే ఉంటాడు. మనం ఏది చింతిస్తే అదే అవుతాము. చైతన్యాన్కి, జడాన్కి మధ్యలోనే మనస్సు ఉంది. మనస్సు, మనస్సుతో చైతన్యాన్ని చింతిస్తే చైతన్యస్థితి కల్గుతుంది. మనస్సు జడవస్తువులను చింతిస్తే జడత్వం వస్తుంది. విషయాలను చింతిస్తే విషంతో నిండిపోతాడు. ఆత్మను చింతిస్తే అమృతత్వాన్ని అంటే చావులేని స్థితిని పొందుతాడు.

భగవాన్‌తో ఒక ఆవిడ మా అత్తగారు రోజూ తిడ్తోంది అంటే; మీ అత్తగారు నీ సాధనకు సహకరిస్తోంది అని ఎందుకు అనుకోవు? నువు నా దగ్గరకు ఎందుకు వచ్చావు? నీ అహంభావన తొలగించుకోటాన్కే కదా! దేహం తిట్టారని బాధపడదు. అహంభావనే బాధపడుతుంది. మరి ఆ అహంబావన నశించటాన్కే కదా! మీ అత్తగారు సహకరిస్తున్నారు అన్నారు భగవాన్. అంచేత అత్తగార్కి కాఫీ ఎలాగా ఇవ్వటం తప్పదు. ఆ ఇచ్చేది ఇష్టంగా ఇస్తే వాసన నశిస్తుంది. అంతేకాదు మనస్సుకు తూకం పెరిగి, లోచూపువచ్చి అంతర్ముఖంగా ప్రయాణించి జ్ఞానోదయం అవుతుంది. శివానందకు గివ్వనంద అని పేరు ఎందుకంటే ఎప్పుడూ ఏదో ఒకటి ఇస్తూనే ఉంటారు ఆయన దగ్గరకు వచ్చినవార్కి. ఒకసారి ఆయన, భక్తులకు పళ్ళు ఇస్తుంటే ఒక అతను అక్కడకు వచ్చి విమర్శిస్తూ ఉంటాడు. అప్పడు శివానంద అన్నారు అతని పని అతను మాననప్పడు మన పని మనం ఎందుకు మానాలి అన్నారు. అంటే ఆయనకు విమర్శించటం పని మనకు ఇవ్వటం పని అన్నారు శివానంద. మానవ జన్మ ఎందుకు? మానవత్వంలోంచి దైవత్వంలోకి రావటాన్కి ప్రయత్నం చేయాలి. జీవుడ్ని, దేవుడ్ని చేయాలి ఇలా చేయటాన్కి చేసే ప్రయత్నమే సాధన. ఒకసారి భగవాన్ ఒక భక్తునితో లోచూపు అలవాటు చేసుకో అన్నారు. అతను కళ్ళుమూసుకుంటే అంతా చీకటిగా ఉంది అన్నాడు. అప్పడు భగవాన్ ఆ చీకటిని కూడా లోపల ఎవరో ఒకడు చూసేవాడు ఉండాలి కదా! వాడ్ని చూడు, నిరంతరం వాడ్ని చూస్తూ వాడి చేష్టలు గమనించటమే లోచూపు

అన్నారు.

మంచిపని అయినా చేసి మర్చిపో శిరస్సుమీద మోయకు, చేసిన మంచి చెపితే పుణ్యాన్కి దూరం అవుతావు. గర్వం పెరుగుతుంది. నీ గర్వం నిన్ను పతనం చేస్తుంది. నువ్వు జారటం మొదలుపెట్టాకా ఎంతదూరం జారిపోతావో ఎవరికి తెలియదు. మిగిలేది చీకటి. జరిగేది ఈశ్వర సంకల్పం, అనుకునేది జీవుడి సంకల్పం. నీ సంకల్పం ఈశ్వరుని సంకల్పం ఒకటి అయినప్పడూ జరిగేది ఈశ్వర సంకల్పమే. నీది ఈశ్వరునిది ఒకటి కానప్పడూ జరిగేది ఈశ్వర సంకల్పమే. ఈ వాక్యంను మననం చేసి జీర్ణం చేసుకోవాలి. అప్పడు అశాంతి అణుగుతుంది. ఈశ్వర సంకల్పాన్ని గౌరవించటం నేర్చుకోవాలి అట్టివాడ్కి దుఃఖం దూరంగా ఉంటుంది. ఏ పనిచేసినా ఈశ్వరానుభవం పొందినవారు సహజంగా, సరళంగా సుఖంగానే చేస్తారు. కాని ఆ పనులు మనకు గొప్పవిగా కన్పించవచ్చును. ఇది పెద్దపని, ఇది చిన్నపని అని బేధాలు కల్పించేది మనస్సు మాత్రమే. నిజమైన మంచివారు వారు మంచివారని అనుకోరు. వారి మంచితనం వార్కే తెలియదు. అట్టివారు మాత్రమే శాంతి సాగరంలో ఈదులాడతారు. మహాత్ములు వాళ్ళ హృదయంలో ఏంఉందో వారు గమనించుకుంటూ ఉంటారు. అది లోచూపు అంటే గాంధీజి ఇలా అన్నారు ఎప్పడు నేను మహాత్ముడిని అంటే, నన్ను ఎవరైనా కాల్చి చంపినా వారిమీద నాకు కక్ష, వైరం, ద్వేషం కల్గకపోతే అప్పడు నన్ను మహాత్ముడని పిలవండి. ఇప్పడు కాదు అన్నారు.

సోక్రటీస్‌ను మిమ్మల్ని అందరూ మమాత్ముడు అంటున్నారు ఎందుకు అని అడిగితే, నాకు ఏమి తెలియదు అన్న విషయం నాకు బాగా తెలుసు. అందుకే నన్ను మహాత్ముడు అంటున్నారు అన్నారు. తక్కువ మాట్లాడేవారు ఎక్కువ పనిచేస్తారు. ఎక్కువ మాట్లాడేవారు తక్కువ పనిచేస్తారు. పటేల్ తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేసేవారు. అందుకే ఆయన్ను ఉక్కుమనిషి అని పిలుస్తారు, శక్తివంతుడు అయ్యాడు. సాధనవల్ల అన్నీ సమకూడతాయి. పనిలో సమర్ధతను పెంచుకోవాలి మనం చేస్తున్న పని ఇహపరాల్ని సాధించటంతోపాటు ఇతర్లకుకూడా ఆదర్శంగా ఉండాలి. పనిలో దైవాన్ని చూడాలి. పనికి జ్ఞానాన్కి విరోదం లేదు. పని నిర్మాణాత్మకంగా ఉండాలి. కోరికతో పనిచేస్తే బంధం, కోరిక లేకుండా పనిచేస్తే మోక్షం, కోరిక లేకుండా పని చేసినా వచ్చేది వస్తుంది. పని చేసేప్పడు నీ హృదయంలో ఉన్న నిర్మలత్వమునకు నువ్వు దూరం కాకూడదు. ఆత్మదృష్టి లోపించినప్పడే చిరాకు, పరాకు వస్తాయి. కర్మయోగి మట్టిలో కల్సిపోయేవరకు పనిచేస్తూనే ఉంటాడు. దేహం మట్టిమయం, మనస్సు దుఃఖమయం, ఆత్మ ఆనందమయం.



20-06-2001

# సమదృష్టి కలవాడు గౌరవాన్ని, అగౌరవాన్ని సమానంగా భరించగలడు

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-6-2001, సిద్ధాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు సీతా, లక్ష్మణ, హనుమంత సమేత రామాలయంలో సమావేశమయ్యాము. ఉపనిషత్తులు చెప్పిన రామమంత్రం :

శ్రీ రామః శరణం మమ, ఓం శ్రీం రాం రామాయనమః

రక్షించేది రామాయణం అంటారు. ఇందులో గృహస్థ ధర్మాలు ఎక్కువగా ఉంటాయి. రామాయణం అంతా ప్రేమమయం. వాల్మీకి రామాయణంలో అనేక పాత్రలద్వారా అనేక మంచి విషయాలు జీవకోటికి భోధిస్తాడు. భోదించటం వ్యక్తికే కాని ఆత్మకు కాదు. రామాయణం చదవటంవల్ల ఎవరిపట్ల ఎలా నడుచుకోవాలి అనే ధర్మాలను నేర్పుతుంది. రామునితో సహవాసం లక్ష్మణుడికి లాభించింది. భరతుడితో సహవాసం శత్రుఘ్నుడికి లాభించింది. ఇప్పుడు అన్నదమ్ములమధ్య ప్రేమ లేకపోయినా లిటికేషన్స్ ఎక్కువ. అంటే పాజిటివ్ తింకింగ్ లేకపోయినా పర్వాలేదు. నెగిటివ్‌గా తింక్ చేయటంవల్ల మనస్సు నెమ్మదిగా కుళ్ళిపోతుంది. వేదాలన్నీ మంత్రములు. నాల్గు వేదాల సారాన్ని మొదటిసారిగా శ్లోకరూపంలోకి తీసుకువచ్చి రామాయణాన్ని వ్రాసింది వాల్మీకి. ఆదికావ్యం రామాయణం, ఆదికవి వాల్మీకి, వేదాలు ప్రతిపాదించిన ఆదిపురుషుడు శ్రీరాముడు. రామాయణం చదివితే నాల్గువేదములు చదివినట్లే. రామాయణంలో ధర్మ, అర్థ, కామ, మోక్షముల గురించి చెపుతారు. వాల్మీకి రామాయణం తర్వాత ప్రఖ్యాతి పొందింది తులసీదాసు రచించిన రామాయణం. ఈ మధ్యకాలంలో చాలా చిన్న, చిన్న మాటలతో రామాయణాన్ని రాజాజి వ్రాశారు అది కూడా చాలా ప్రాచుర్యం పొందింది. రాజాజిలో ప్రత్యేకత ఏమిటంటే ఆలోచనలో, భాషలో ఆడంబరం ఉండదు. ఆలోచనలో ఆడంబరం ఉంటే మాటలో ఆడంబరం వస్తుంది. పెద్దలు రామాయణ, భారతాలకు నిర్వచనం ఏం చెపుతారంటే భూమిమీద కాంక్షతో దుర్యోధనుడు, స్త్రీ కాంక్షవల్ల రావణాసురుడు పతనం అయ్యారు. అది భారతం, ఇది రామాయణం.

రాముడు లక్ష్మణుడ్ని మామూలుగా పిలిచేటప్పుడు లక్ష్మణా అనేవాడు. ఎవరితోనైనా జాగ్రత్తగా మాట్లాడవలసివచ్చినప్పుడు మాత్రం సౌమిత్రీ అనేవాడు. హనుమంత, సుగ్రీవుల పరిచయాలయ్యాకా వాళ్ళ గురించి వాళ్ళు చెప్పకున్నారు. మన గురించి నువ్వుకూడా అంతకంటే జాగ్రత్తగా చెప్ప "సౌమిత్రీ" అంటాడు రాముడు అంటే నువ్వు సుమిత్ర కుమారుడివి

మీ అమ్మలాగే జాగ్రత్తగా మాట్లాడాలి అని కారణం. సుమిత్ర గంట మాట్లాడినా ఒక తప్పు పట్టుకోలేము అంత సౌమ్యంగా మాట్లాడేది. అది వాక్కు తపస్సు. వాక్కుతపస్సు ఉంటే వెనుక భావం అటుంచండి ముందు ఆ వాక్కుతపస్సు వెనుక భావనా బలం ఉంటుంది. తలంపు వచ్చాక మాట వస్తుంది. మాట నేర్పుగా ఉండాలి, తలంపుల విషయంలో జాగ్రత్త పడాలి.

రావణాసురుడితో రాయబారానికి వెళ్ళినప్పుడు ఆంజనేయస్వామితో వాల్మీకి ఇలా అనిపిస్తాడు, రాముడు అంటే ఎవరు నీ ఉద్ధేశంలోకి. ఆత్మలకు ఆత్మ అంటే ఈ సృష్టి ఎవరిలోంచి వస్తోందో, ఈ సృష్టిని ఎవరు నడిపిస్తున్నారో, ఈ సృష్టికి ఉనికి, అస్థిత్వం ఎవరిలో ఉందో, ఈ సృష్టి ఎక్కడ లయం అవుతుందో ఆ పరబ్రహ్మమే రాముడు అని రాముని దూతగా ఆంజనేయస్వామి రామప్రభువుయొక్క బలం, సూరత్వం రావణాసురుడికి వెల్లడించాడు. పైగా నరుడితో, వానరుడితో చావు రాకూడదు అని వరం పొందలేదని సూచన కూడా ఇస్తాడు హనుమంతుడు. ఎంత సూచించినా మంచి విషయాలు గ్రహించటానికి తగిన యోగ్యత ఉండాలి. భరద్వాజ మహర్షి దగ్గర భరతుడు తన తల్లిని పరిచయంచేస్తూ నిందా పూర్వకంగా మాట్లాడతాడు. అప్పుడు భరధ్వాజుడు భరతుడికి ఉపదేశిస్తూ మాతృనింద పనికిరాదని ఒక అద్భుతమైన శక్తి లోకాన్ని, జీవకోటిని నడిపిస్తోందని ఆ శక్తే కైకద్వారా రామునియొక్క వనవాసమును నిర్దేశించినదని అన్నారు.

భగవంతుడ్ని పొందటానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. అందులో ప్రేమమార్గంద్వారా భగవంతుడ్ని సులభంగా దర్శించవచ్చును. ప్రేమించలేనివాడు భక్తుడు కాలేడు, మహర్షి కాలేడు, మహాత్ముడు కాలేడు. భక్తి బలం ఉన్నవాడు భగవంతుడ్ని నిరంతరం దర్శిస్తూ ఉంటాడు. గౌరవాన్ని, అగౌరవాన్ని సమానంగా భరించేవాడికి సమదృష్టి కల్గుతుంది. వాడే యోగి అవుతాడు. అశోకవనంలో సీత దేహంఉన్నా మనస్సుతో ఎప్పుడూ రామచంద్రస్వామినే ధ్యానించేది. మనస్సు ఎక్కడ ఉంటే మనం అక్కడ ఉండటం దానినే ఉపాసన అంటారు. దేహప్రారబ్ధాన్ని బట్టి పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా ఈశ్వరుడి పాదాలయందు మనస్సును నిలబెట్టి ఉంచాలి. మనల్ని రక్షించేవి, అనుగ్రహించేవి ఆయన పాదాలే. పుట్టుకతోనే ప్రతి మనిషికీ కొన్ని బలహీనతలు ఉంటాయి. మానవుడు సంపాదించిన ధనం ఆ బలహీనతలను పెంచుటకు సహకరిస్తే ఆ ధనమే వాడి నాశనానికి కారణమై శత్రువు అవుతుంది. వాడి బలహీనతలు తగ్గించుటకు వాడి ధనం ఉపయోగపడితే అట్టి ధనం వాడికి మిత్రుడుగా సహకరిస్తుంది అని వేదమాత చెపుతుంది. అందుకే ప్రపంచంలోని మాయ అంతా ధనరూపంలో పెట్టాడు ఈశ్వరుడు అన్నాడు వాల్మీకి. కుటుంబ పరిస్థితుల్ని అర్థం

చేసుకోకుండా ప్రవర్తించేవాడికి చెట్టుయొక్క చిటారుకొమ్మన నిద్రించేవాడ్కి ఏ గతి పడుతుందో వాడికీ అదే గతి పడుతుందని రామాయణంలో ఉంది. మన మాట, చేత, తలంపు మనకు చిత్తశుద్ధి కల్గటాన్కి సహకరించాలి. చిత్తశుద్ధి సంపాదించుటకు ఉపయోగపడని పని అది పనే కాదు. చిత్తశుద్ధి అనే గేటుద్వారానే మనం మోక్షంలో ప్రవేశించాలి. చిత్తశుద్ధి లేని పూజలు, జపాలు దేనికి కొరగావు అన్నాడు వేమన కవి. చిత్తశుద్ధిని సంపాదించుటకు జీవితం మనకు ఒక అవకాశాన్ని కల్పించింది. సమాజ మధ్యంలో అనేక అభిప్రాయ బేధాలు ఉండచ్చు. వాట్ని అవగాహనతో పరిష్కరించుకోవాలి. అలా పరిష్కరించుకొనే శక్తి కొరవడినప్పడు అభిప్రాయ బేధాలు స్పర్ధలుగా మారి చివరకు సంస్కారాలుగా మారి అవే అనేక పునర్జన్మల హేతువులుగా మారతాయి. నూరు చేతులతో సంపాదించి వెయ్యి చేతులతో ధర్మం చేయమని వేదవాక్యం. ఇచ్చే అలవాటు ఉంటే సంపన్నుడి ద్రవ్యం సద్వినియోగం అవుతుంది. ఐశ్వర్యమంటే ఒక్క ధనం మాత్రమే కాదు, శాంతి, ధైర్యం, క్షమ, దక్షత, విద్య, అర్హత, యోగ్యత ఇవన్నీ ఐశ్వర్యంలో భాగములే. ఇవన్ని గుప్త ధనం. అంతేకాదు జీవుడ్ని ఇవి పరమపవిత్రుడ్ని చేస్తాయి.

భగవంతుడు అంటే కేవలం ఒక వ్యక్తికాదు. మన హృదయంలో ఉన్న సత్యం మాత్రమే. దాన్కి చావులేదు. జడత్వం లేదు. దాని స్వరూపమే ఆనందం అయితే మనం చూస్తున్న రూపములకు, నామములకు, గుణములకు, జనన మరణములకు అది అతీతమైనది. జపం జడమైన శరీరం చేయదు, జపంతో బ్రహ్మంకి పనిలేదు జపం చేసేది మనస్సు మాత్రమే. జపంచేసే మనస్సు జపించి, జపించి దాని మూలంలో అణిగిపోతే బ్రహ్మమే మిగులుతుంది. జపంకూడా ఒక తలంపు మాత్రమే. మిగతా తలంపుల్ని తొలగించి తానుకూడా అదృశ్యమౌతుంది. అప్పడు మిగిలేది సమాధి స్థితే. చావు జీవితంలో ఒక భాగమే. చనిపోయిన వారి గూర్చి దుఃఖించటం వలన కాలం ఖర్చు అవుతుంది. మనస్సు కుళ్ళిపోతుంది. కుళ్ళిపోయిన మనస్సున్నవారు ఇహపర జీవితాన్కి దూరం అవుతారు. ఎవరి మనస్సు వార్కి శిక్ష. సమాజపరంగా, కుటుంబపరంగా, లోకపరంగా వచ్చే బాధలకంటే మనస్సు కల్పించే బాధలే ఎక్కువగా ఉంటాయి. మనస్సుకు పరిమితులు ఉంటాయి. మనోమూలంలో ఉన్న పరమార్థమునకు పరిమితులు లేవు అదే సత్యం. అదే శాంతి, అదే బ్రహ్మం, అదే జ్ఞానం, అదే అనంతం, అదే నారాయణుడు. భగవంతుడు కర్మఫలదాత ఎవరు ఏది చేసినా దాన్కి తగిన ఫలం ఉంటుంది. వ్యక్తికి మంచికి మంచి, చెడుకి చెడు అనుభవంలోకి వస్తుంది. ఇవన్నీ ఒకే జన్మలో రాకపోయినా కాలప్రవాహంలో వస్తాయి. ద్వంద్వాలన్నీ మనస్సులోనివే. ఏకాగ్రతతో

జీవితం పొడగునా ఈశ్వర స్మరణవల్ల ద్వంద్వమయ జీవితమునుండి విడుదల పొందవచ్చు. కొంతమంది ఎక్కడ వస్తువులు అక్కడ పెట్టరు.. అస్తవ్యస్థంగా ఉంటారు. అస్తవ్యస్థంగా ఉండటంవల్ల కాలం, శక్తి వృధా అవుతుంది. కొంతమంది తిన్న కంచాలు విసిరేస్తారు. అలా విసిరేస్తే రాబోయే జన్మల్లో ఉన్నది పోయి మన చేతులే చిప్పలు అవుతాయి. జప, ధ్యానాలవల్ల అస్తవ్యస్థం పోయి ఎక్కడ వస్తువులు అక్కడ పెడతారు. వస్తువులను గౌరవిస్తారు. తింగరతనం పోయి నిదానం వస్తుంది. రూపాయి విలువ తెలుసు కాబట్టి రూపాయి కాగితాలు జాగ్రత్త చేసుకుంటున్నారు. అలాగే నామం విలువ తెలిసినప్పుడే హృదయపూర్వకంగా చేయగలరు. మీరు 60 సం॥లు విషాదంగా జీవించేకంటే 10 సం॥లు జీవించినా ఏ రోజుకు ఆ రోజు మీ ఊపిరిని మధురాతి మధురంగా నింపుకోండి అదే జీవితం.

**మనిషిని చంపకుండా చంపేమందు**

**ఆత్మజ్ఞానము.**

**ఆత్మజ్ఞానము**

**మీ దేహామునుతీసివేయదు,**

**మీ ప్రాణమును తీసివేయదు.**

**మీ అహాంభావనను తీసివేస్తుంది.**

# పాలకొల్లులో జూలై 4న విప్లవజ్యోతి అల్లూరి జయంతి



పాలకొల్లు పెన్మెత్స సత్యనారాయణరాజు, సూర్య పద్మావతి క్షత్రియ సంక్షేమ పరిషత్ కల్యాణ మండపంలో **జూలై 4న విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు** నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమములో ముఖ్యఅతిధులుగా **సద్గురు శ్రీనాన్నగారు, పద్మభూషణ్ డాక్టర్ శ్రీ బి.వి. రాజు**, అల్లూరి విగ్రహ దాత **శ్రీ ఇసుకపల్లి రామకృష్ణంరాజు** (వైజాగ్), సన్మాన గ్రహీత, స్వాతంత్ర్య సమరయోధులు **శ్రీ కలిదిండి విజయనరసింహరాజు**, ఎక్స్ ఎమ్.ఎల్.ఎ., పాలకొల్లు శాసన సభ్యులు **శ్రీ అల్లు వెంకట సత్యనారాయణ**, మున్సిపల్ చైర్మెన్ **శ్రీ శిడగం పాపారావు**, **శ్రీ మంతెన సూర్పరాజు**, ఈడూరు తదితర ముఖ్యులు పాల్గొంటున్నారు.

ఈ సభలో ప్రతిభ కలిగి ఆర్ధికంగా వెనుకబడిన హైస్కూలు, కాలేజీ క్షత్రియ విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించారు. పాత నరసాపురం తాలూకాలోని పాలకొల్లు, పోడూరు, ఆచంట, నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల పరిధిలోని వారికి మాత్రమే ఈ సహాయం అందుతుందని ఆ సంస్థ సంక్షేమ కన్వీనరు శ్రీ దంతులూరి సత్యనారాయణరాజు వివరించారు. అర్హులైనవారు జూన్ 29లోగా కల్యాణ మండపంలో దరఖాస్తులు అందించాలని, స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు ఫారాలు క్షత్రియ సంక్షేమ పరిషత్ కార్యాలయములో లభిస్తాయని ఆయన తెలిపారు.

ప్రముఖులు పాల్గొనే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆ సంస్థ కార్యదర్శి శ్రీ పి. శ్రీరామరాజు వెల్లడించారు.